క్లుప్తంగా

నేడు ఉల్లాస్‌పై శిక్షణ

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్‌పై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాస్ గురువారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి వలంటరీ టీచర్లందరూ హాజరు కావాలన్నారు. సమాజంలో నిరక్షరాస్యులను గుర్తించి, వారికి అభ్యాసన, అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పెదపూడి: జి.మామిడాడ సబ్‌స్టేషన్ వద్ద కొత్త లైన్ల ఏర్పాటు పనుల కోసం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ నిలిపివేయనున్నట్లు కాకినాడ విద్యుత్ శాఖ ఏఈ ఎస్.ఉదయ భాస్కర్ తెలిపారు. ఆ సమయంలో రాజుపాలెం, గండ్రేడు, వేండ్ర, పెద్దాడ, కై కవోలు, కుమార ప్రియం. జి.మామిడాడ గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలోని మిర్తిపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపివేస్తామని రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. దాని పరిధిలోని 11 కేవీ మధురపూడి అగ్రికల్చర్, 11 కేవీ తొర్రేడు ఇండస్ట్రియల్ ఫీడర్లకు విద్యుత్ ఉండదన్నారు. ఈ నేపథ్యంలో బొబ్బిల్లంక, కాటవరం, జాలిమూడి, ఉండేశ్వరపురం గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

చిన్నారులకు తులాభారం



చిన్నారులకు తులాభారం వేస్తున్న భక్తులు

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయానికి గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున కాకడ హారతి ఇచ్చిన అనంతరం మూలావిరాట్‌కు భక్తులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం బాబా వారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. బాబా సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన కాకిలేటి, పసుపులేటి కుటుంబ సభ్యులు తమ చిన్నారులకు పటిక బెల్లంతో తులాభారం వేశారు. మండలంలోని కలవచర్లకు చెందిన వీరు ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

మధురపూడి: కోరుకొండ మండల పరిధిలో పనిచేస్తున్న నలుగురు సచివాలయం కార్యదర్శులకు పదోన్నతి లభించింది. వీరందరూ గ్రేడ్ 5, 4 కార్యదర్శులుగా పదోన్నతి పొందారు. గాదరాడ-2 కార్యదర్శి టెంకే రాజబాబు, కోరుకొండ-2 సచివాలయం కార్యదర్శి ఎ.గణపతి, రాఘవపురం కార్యదర్శి కె.రుద్రశేఖర్, మునగాల కార్యదర్శి జి.సాయివరప్రసాద్ పదోన్నతి పొందారు. వీరిని కోరుకొండ ఎంపీడీఓ బి.అశోక్ కుమార్, ఈఓపీఆర్డీ బి.మహేశ్వర ప్రతాప్ అభినందించారు.

పాస్టర్ల కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

రంగంపేట: మండల పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం పెదరాయవరంలో ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా పి.గిద్యోను, ఉపాధ్యక్షుడిగా ఎం.లాజరు, చైర్మన్‌గా సీహెచ్ శామ్యూల్ సుదర్శన్, వైస్ చైర్మన్‌గా ఎస్.చక్రవర్తి, గౌరవ అధ్యక్షుడిగా ఎం.జ్యోతిబాబు, సెక్రటరీగా ఎం.చిట్టిబాబు, జాయింట్ సెక్రటరీగా కె.విజయరత్నం, ట్రెజరర్‌గా కె.శామ్యూల్ ఎన్నికయ్యారు. అనంతరం సంఘ సభ్యులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

చెత్త నుంచి సంపద కేంద్రం పరిశీలన



నాగంపల్లిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ మూర్తి

సీతానగరం: నాగంపల్లి పంచాయతీలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామని ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఆయన గురువారం నాగంపల్లి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి, త్వరలో వాడుకలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శి స్టీఫెన్‌కు సూచించారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని పారిశుధ్యంపై ఆరా తీశారు.

వివక్ష వీడితే విజయబావుటా..

- ఆడ, మగ అన్న తేడా చూపొద్దు
- బాలికలకు ప్రోత్సాహం అవసరం
- విద్యతోనే జీవితానికి వెలుగు
- నేడు బాలికా దినోత్సవం



పందలపాక పాఠశాలలో బాలికలు

బిక్కవోలు: ఆధునిక కాలంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ప్రతి పనిలోనూ సత్తా చాటి ముందుకు దూసుకుపోతున్నారు. చదువు, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా రంగాల్లో ముందంజలో సాగుతున్నారు. మన సమాజంలో మహిళలకు చాలా ప్రాధాన్యం ఉంది. అయితే.. నేటికి కొన్ని చోట్ల ఆడపిల్లలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. ఈ భావనను తొలగించి, వారిని ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు సాధిస్తారు. నేడు (శుక్రవారం) బాలికా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కొన్ని చోట్ల వివక్ష

అమ్మాయి నవ్వు ఇంటికి అందాన్నిస్తుంది. పాప నడుస్తూ ఉంటే ఇంటిల్లపాదీ మురిసిపోతారు. చిట్టి తల్లి చిరునవ్వే కుటుంబానికి కొండంత బలం. ఈ సృష్టికి మూలమైన బాలిక ఆధునిక సమాజంలోనూ కొన్నిచోట్ల వివక్షకు గురవుతోంది. ఆధిపత్య భావం, అసమానత, చిన్న చూపు, వేధింపులు, హింస.. ఇలా ఏదో ఒక రీతిలో కౌమార దశలో ఆడపిల్లలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. అలాగే ఆడపిల్ల అని తెలిస్తే గర్భంలోనే తుంచివేసే దుర్మార్గులు కూడా కొందరు ఉన్నారు.

పెరిగిన అవగాహన

ఆధునిక సమాజంలో తల్లిదండ్రులకు అవగాహన పెరిగింది. మగ, ఆడపిల్లలకు ఒకేలా చూస్తున్నారు. బాలురతో సమానంగా బాలికలకు కూడా చదువు చెప్పిస్తున్నారు. వారు అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు ప్రోత్సాహం అందిస్తున్నారు. ముఖ్యంగా చదువు పూర్తి చేసి, ఉద్యోగంలో చేరి, వారి కాళ్ల మీద నిలబడేలా చేస్తున్నారు. గతంలో మాదిరిగా 18 ఏళ్లకే పెళ్లి చేసి అత్తారింటికి పంపించి వేసే విధానం తగ్గిపోయింది. బాలిక సంరక్షణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది. వారికి కోసం వివిధ పథకాలను అమలు చేస్తుంది. అలాగే బాలిక రక్షణకు కఠిన చట్టాలను తీసుకువచ్చింది. వారికి ఏదైనా అన్యాయం జరిగితే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. బాలిక సంరక్షణకు భారత ప్రభుత్వం నేషనల్ గరల్స్ డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో ఒక కార్యక్రమంలో రూపొందించింది. దానిలో భాగంగా 2008లో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంతో జాతీయ బాలికా దినోత్సవానికి శ్రీకారం చుట్టింది.

సమానత్వం అవసరం



బాలురు, బాలికలు ఇద్దరినీ సమానంగా చూడాలి. చదువు, పౌష్టికాహారం, ఆరోగ్యం తదితర విషయాల్లో బాలికలపై కుటుంబం వివక్షత చూపడం ఇంకా కొన్నిచోట్ల కనిపిస్తోంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలి. వారి ఎదుగుదలకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పాటు సమాజం తోడుగా నిలవాలి.

– జెస్సీ ఫోరెన్స్, ఐసీడీఎస్ సీడీపీఓ, రంగంపేట

అన్ని రంగాల్లో ప్రతిభ



మాకు ఆడపిల్ల పుట్టినందుకు చాలా సంతోషించాం. తనను చాలా అపురూపంగా చూసుకుంటున్నాం. ముందుగా మంచి చదువు చెప్పిస్తున్నాం. ఆమె అనుకున్న లక్ష్యం చేరుకునే వరకూ ప్రోత్సాహం అందిస్తాం. నేటి కాలంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదుగుతున్నారు.

– వెంకటలక్ష్మి, పందలపాక

మహాలక్ష్మి పుట్టినట్టే..



మాకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. ఇద్దరినీ సమానంగా పెంచుతున్నాం. వారు జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలనే లక్ష్యంతో బాగా చదివిస్తున్నాం. సమాజంలో మంచి చెడ్డలను చెబుతున్నాం. ఆడపిల్ల పుడితే ఇంటికి మహాలక్ష్మి వచ్చినట్టే. అయితే కొన్ని చోట్ల బాలికలపై వివక్ష చూపిస్తున్నారు. సమాజంలో ఈ పరిస్థితిని రూపు మాపాలి.

– బండారు రామలక్ష్మి, కొప్పవరం

వివక్ష తొలగాలి



అమ్మాయి, అబ్బాయి అనే వివక్ష సమాజంలో పోవాలి. ముందుగా తల్లిదండ్రుల్లో ఈ మార్పు రావాలి. ఇప్పటికీ కొందరు తమ ఇళ్లలో మగ పిల్లలపై ఎక్కువ ప్రేమ చూపిస్తున్నారు. ఆడబిడ్డలను తక్కువగా చూస్తున్నారు. ఈ వివక్షతో ఆడపిల్లలు మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆడ, మగ సమానమే అన్న భావన వచ్చినప్పుడు సమాజ ప్రగతి సాధ్యమవుతుంది.

– మానవరపు శిరీష, ఉపాధ్యాయులు, కొంకుదురు

ధైర్యాన్ని అలవాటు చేయాలి



ధైర్యంగా ఉండేలా చిన్నతనం నుంచే బాలికలను సిద్ధం చేయాలి. మానసికంగా, శారీరకంగా శక్తివంతులుగా తీర్చి దిద్దాలి. ఏదైనా ఆపద వచ్చినప్పుడు తమకు తాము కాపాడుకునేలా ఆత్మరక్షణ విద్య నేర్పించాలి. కొన్ని చోట్ల బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు చూస్తుంటే బాధ కలుగుతోంది. వీటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను అమలు చేస్తుంది.

– శ్రీలక్ష్మి పంచాయతీ కార్యదర్శి, పందలపాక

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎల్‌పీవో నాగలత

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ఎం.నాగలత అన్నారు. ఆమె గురువారం సీతానగరం సచివాలయాన్ని సందర్శించారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని కూడా పరిశీలించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఇంటి, కుళాయి పన్నులను నూరు శాతం వసూలు చేయాలని, ఇళ్ల నుంచి చెత్తను తడి, పొడిగా వేరు చేసి సేకరించాలని, దాన్ని సంపద కేంద్రానికి తరలించాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణ మూర్తి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆర్గానిక్ అరటి.. భలే రుచి



వేమగిరితోట పాఠశాలలో పండించిన అరటి గెలలు

కడియం: ఎరువులు క్రిమిసంహారక మందులు విపరీతంగా వాడుతున్న ఈ రోజుల్లో.. అవేమి వాడకుండా ప్రకృతి సిద్ధంగా అరటి చెట్టుకు కాసిన గెలలో ఒక్కో అత్తానికి 3 డజన్లకు పైగా కాయలు వచ్చాయి. వేమగిరి తోట -1 మండల పరిషత్ స్కూల్లో అరటి చెట్లకు పండిన గెలలను గురువారం కోశారు. వాటిలో ఒక అత్తానికి 40 పండ్లు, మరో దానికి 46 పండ్లు కాశాయి. పాఠశాలలోని బడితోటలో ప్రధానోపాధ్యాయుడు కె.జయరాజు, సహోపాధ్యాయులు శ్రద్ధతో పండించారు. కోసిన గెలలు మరింత ముగ్గిన తరువాత పిల్లలకు పంపిణీ చేస్తామన్నారు.

జక్కంపూడి కుటుంబంతో నియోజకవర్గ అభివృద్ధి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహిళా నేతలు

- వైఎస్సార్ సీపీ నాయకురాలు రమాదేవి
- కోరుకొండలో విలేకరుల సమావేశం

మధురపూడి: ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అవినీతి, అక్రమ దందాలకు చిరునామాగా నిలిస్తే, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి జక్కంపూడి కుటుంబం కృషి చేసిందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ కన్వీనర్ రాజా రమాదేవి అన్నారు. కోరుకొండలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే, జక్కంపూడి రాజా దయతో ఎంపీటీసీ పదవి దక్కించుకున్న బత్తుల వెంకటలక్ష్మి, ప్రస్తుతం అవాస్తవాలు మాట్లాడటాన్ని తప్పుపట్టారు. రాజీనామా అప్పట్లోనే చేసినట్టు మీడియాకు వెల్లడించడం, వాస్తవాలు సమాజానికి తెలియదనుకోవడం తెలివి తక్కువతనమే అవుతుందన్నారు. రెండున్నరేళ్ల తర్వాత రాజీనామా చేసినట్టు మీడియాకు వెల్లడించడం విడ్డూరమేనన్నారు. 2021 మే 25వ తేదీన జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో గెలిపించి, మండలంలోనే రాజకీయ భవిష్యత్తును జక్కంపూడి కుటుంబం కల్పించిందన్నారు. 2022 మే 25న పార్టీకి భర్త బలరామకృష్ణతో పాటు రాజీనామా చేసిన వెంకటలక్ష్మి.. ఎంపీటీసీ పదవికి మాత్రం పద్ధతి ప్రకారం రాజీనామా చేయలేదన్నారు. దీంతో ఆమెకు 2022 జూన్‌లో అధికారులు నోటీసులు ఇచ్చారని, వరసగా మూడు మండల సర్వసభ్య సమావేశాలకు హాజరు కాని కారణంగా అక్టోబర్‌లో తొలగిస్తున్నట్టు నోటీసులిచ్చారన్నారు. అయితే నవంబర్‌లో హైకోర్టు స్టే తెచ్చుకున్న ఆమె.. అనైతికంగా మాట్లాడడం సబబు కాదని హితవు పలికారు. జక్కంపూడి కుటుబానికి వైఎస్సార్ సీపీలో ఉన్న వారంతా సైన్యమే అన్నారు. రాజమహేంద్రవరం–సీతానగరం రహదారి అభివృద్ధి, కోరుకొండలో ఫైర్ స్టేషన్ నిర్మాణం, విద్య, వైద్యం, ఉపాధి తదితర విభాగాల్లో జక్కంపూడి చేసిన అభివృద్ధి అందరికీ తెలిసిందేన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావొస్తున్నా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. తాము చేసిన అభివృద్ధి – మీ అరాచకాలపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. సమావేశంలో వేమగిరి విజయ, కొండేపూడి లక్ష్మీశిరీష, సానబోయిన మణిమ ల్లేశ్వరి, వడ్డాది వరలక్ష్మి, ఉల్లి ప్రమీల పాల్గొన్నారు.

స్వామి వివేకానంద పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తదితరులు

పెదపూడి: నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగాగా హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బెలూన్లను గాలిలోకి ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దుప్పలపూడి ఆర్‌వీఆర్ కన్వెన్షన్‌లో సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 23 ఏళ్లుగా వివేకనందుని భావజాలాన్ని అనపర్తి ప్రజానీకానికి తెలియచేసి, వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న అనపర్తి రామకృష్ణ సేవా సమితి సేవలు అభినందనీయమన్నారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన ఐఏఎస్ మాజీ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరినీ తన సందేశాలతో ప్రభావితం చేసిన మహానుభావుడు వివేకానందుడు అని కొనియాడారు.

పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

ఏపీ శాసనసభ పూర్వ ఉపసభాపతి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, చిలుకూరి బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్, ఏపీ నీటిపారుదలశాఖ సలహాదారు బ్యారేజీ నిపుణుడు నాగినేని కన్నయ్య నాయుడుకు స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రాధా మనోహన్ దాస్‌కు స్వామి వివేకానంద ఎక్స్‌లెన్స్ పురస్కారం ప్రదానం చేశారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. పురస్కారం కింద ఒక్కొక్కరికీ రూ.25 వేలు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో సబ్బెళ్ల అమ్మిరెడ్డి, మేడపాటి రామలింగారెడ్డి, రామకృష్ణ మిషన్ సభ్యుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సత్యసాయి బోధనలు అనుసరణీయం



కోటపాడులో మాట్లాడుతున్న బులుసు వెంకటేశ్వర్లు

రంగంపేట: సత్యసాయిబాబా బోధనలు అనుసరణీయమని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. కోటపాడు గ్రామానికి సత్యసాయిబాబా వచ్చి 56 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది నవంబరు 23న జరిగే బాబా శత జయంతి ఉత్సవాల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి మందిరం వద్ద బాబా పాదుకులకు, చిత్ర పటానికి పూజలు చేసి ప్రత్యేక రథంలో ఊరేగింపు నిర్వహించారు. బాబా ప్రసంగించిన రామాలయం వద్ద 100 పాటలతో సామూహిక భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సేవా సమన్వయకర్త బిక్కిన రామలక్ష్మి, విద్యా విభాగ సమన్వయ కర్త ఎల్.శ్రీనివాసరాజు, వేదాధ్యయన సమన్వయకర్త కందర్ప శ్రీరామమూర్తిశర్మ, ఐటీ విభాగ సమన్వయకర్త పోతుల ఈశ్వరరావు, జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, సబ్ జోన్ కన్వీనర్ మల్రెడ్డి వీర్రాజు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డి సోదరులకు పలువురి పరామర్శ



బాపాయమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ ప్రసాద్ తదితరులు

పెదపూడి: అనపర్తి మండలం రామవరం గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఆయన సోదరులు శ్రీనివాసరెడ్డి, వెంకట కృష్ణారెడ్డిలను గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ గురువారం పరామర్శించారు. సబ్బెళ్ల మాతృమూర్తి బాపాయమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. అలాగే అనపర్తి ఎంపీపీ ఎ.సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి, పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పరామర్శించారు.

వసతుల కల్పనకు కృషి

పెదపూడి: నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలో పైన, కరకుదురు, జి.మామిడాడ గ్రామాల్లో నిర్మించే రోడ్లను గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. సంపర, పుట్టకొండ, కరకుదురు, గండ్రేడులో అభివృద్ధి పనులను ప్రారంభించారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ విజయ భాస్కర్

కంబాలచెరువు: స్థానిక ఐఎంఏ హాలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఆ వివరాలను నిర్వాహకులు గురువారం విలేకరులకు తెలిపారు. ఐఎంఏ రాజమహేంద్రవరం అధ్యక్షుడిగా పిడుగు విజయ భాస్కర్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.రాజశేఖర్, సెక్రటరీలుగా దాట్ల సతీష్, రఘు, అనసూరి ప్రియాంక, రవి కిరణ్, ధర్మతేజ, అరుణ్, సత్యప్రసాద్, శేఖర్ రెడ్డి, కోశాధికారిగా దుర్గాప్రసాద్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నారు. ఎన్నికలను డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ రామరాజు, డాక్టర్ వీరన్న చౌదరి పర్యవేక్షించారు.

గ్రామాల్లో వైద్య సిబ్బంది సర్వే



రాజంపేటలో సర్వే చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

సీతానగరం: లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌లో ఇప్పటికి 22,082 మందిని పరీక్షించగా వారిలో 86 అనుమానిత కేసులు గుర్తించామని, వారికి డాక్టర్లతో పరీక్షలు చేయించగా ఎవ్వరికీ లెప్రసీ నిర్ధారణ కాలేదని ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు తెలిపారు. రాజంపేటలో గురువారం నిర్వహించిన సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీహెచ్‌సీ వైద్యుడు ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో మండలంలో లెప్రసీ సర్వే వేగవంతంగా జరుగుతోందన్నారు. ప్రతి ఇంటిని వైద్య సిబ్బంది సందర్శించి, కుటుంబంలో సభ్యులందరినీ పరిశీలిస్తున్నారన్నారు. ఏమైనా అనుమానిత మచ్చలుంటే, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందిస్తున్నామన్నారు. అనంతరం డాక్టర్లు వచ్చి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. మండలంలో ఇప్పటి వరకూ ఒక్క కేసు కూడా నిర్ధారణ కాలేదని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కావేరి, ఏఎన్ఎం ప్రశాంతి, హెచ్ఎ కిశోర్, ఆశ వర్కర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

వంగలపూడిలో పశువైద్యశిబిరం



వంగలపూడిలో పాడి రైతులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ, కూటమి నాయకులు

సీతానగరం: మండలంలోని వంగలపూడిలో గురువారం నిర్వహించిన శిబిరంలో 82 పశువులకు, 70 జీవాల (మేకలు, గొర్రెలు)కు మండల పశువైద్యాధికారి డాక్టర్‌లె.ఫణీంద్ర వైద్య సేవలు అందించారు. సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, కూటమి నాయకుల చేతుల మీదుగా పాడి రైతులకు పశువుల మందులను అందజేశారు. డాక్టర్ ఫణీంద్ర మాట్లాడుతూ ముగ్గళ్లో శుక్రవారం నిర్వహించే శిబిరంలో ఇనుగంటివారిపేట, ముగ్గళ్లలోని పాడి పశువులు, మేకలు, గొర్రెలకు వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏహెచ్ఎలు గీతిక, సుధాకర్, యామిని, వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కొంచ భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు

బిక్కవోలు: తొస్సిపూడిలో నిర్వహించిన శిబిరంలో 90 పశువులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా అనపర్తి పశుసంవర్ధకశాఖ ఏడీ వై.శ్రీనివాసరావు మాట్లాడూత నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలోని డాక్టర్లు ప్రణీత్, వీర్రాజు, రవి కుమార్, ఏహెచ్ఏ గిరి, సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై అధికారుల విచారణ



ఆలయంలో పట్టపగలు వెంకటరావుతో మాట్లాడుతున్న దేవదాయశాఖ అధికారులు

అల్కాట్‌తోట: రాజమహేంద్రవరంలోని రోటరీ మహాకాళేశ్వర ఆలయంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై గురువారం దేవదాయశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఆలయ పూర్వపు అర్చకులు దేవులపల్లి కృష్ణశాస్త్రి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆమె ఆదేశాల మేరకు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ టీవీఎస్ఆర్ ప్రసాద్, సిబ్బందితో విచారణకు హాజరయ్యారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ పట్టపగలు వెంకటరావు, పూర్వపు అర్చకులు దేవులపల్లి కృష్ణాశాస్త్రిని వేర్వేరుగా విచారించారు. విచారణకు వచ్చిన అధికారులు ఆలయంలోని ఉపాలయాలు, ప్రధాన శివలింగాన్ని సందర్శించారు. అనంతరం విచారణ చేపట్టారు. ఇరువురినీ విచారణ చేసిన అధికారులు.. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు. విచారణ అనంతరం దేవులపల్లి కృష్ణశాస్త్రి విలేకరులతో మాట్లాడుతూ దేవదాయశాఖ అధికారులు తీసుకురమ్మన్న ఎటువంటి రికార్డులు ఏమి లేకుండానే విచారణ పూర్తయిందని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.

నేతాజీ జీవితం స్ఫూర్తిదాయకం



నేతాజీ జీవిత చరిత్రను తెలుసుకుంటున్న విద్యార్థులు

బిక్కవోలు: స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం స్ఫూర్తిదాయకమని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. ఆ పాఠశాల ఆవరణలో గురువారం నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బోస్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్రోద్యమ చరిత్రలో నేతాజీ పాత్రను ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ సాయంతో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలోని పడాల ఈశ్వర్ రెడ్డి, లక్ష్మణ రెడ్డి, వలిషా, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.